**కథ** — **ఆకునూరి మురళీకృష్ణ**

# సంక్రాంతి... లైవ్ ఫ్రమ్ దోసకాయలపల్లి

**మర్నాడు సెమినార్‌లో సబ్మిట్ చేయాల్సిన పేపర్స్‌ని చదువుకుంటున్న నా ఏకాగ్రతని చెదరగొడుతున్నాయి పక్క గదిలోంచి వినిపిస్తున్న మాటలు.**

**సాధారణ విషయాలని కూడా చాలా పెద్ద స్థాయిలో తప్ప మాట్లాడుకోలేని నా పుత్రికారత్నాల గొంతులు వినడం నాకు చిన్నప్పుడు నుంచీ అలవాటైపోయింది. ప్రస్తుతం నన్ను డిస్టర్బ్ చేస్తున్నది వాళ్ల మాటలు కాదు.. వాళ్ల మాటలలోని విషయం!**

''సంక్రాంతి అంటే ఏమిటి?'' అడుగుతోంది రమ్య.

''ఆమాత్రం తెలీదూ? సంక్రాంతి అంటే ఒక పండుగ'' అంది కావ్య.

''అది తెలుసులేవే.. ఎందుకు పండుగా అని? నరకాసురుడు చనిపోయాడని దీపావళి చేసుకుంటారు. మహిషాసురుడు చనిపోయాడని దసరా పండుగ చేసుకుంటారు. మరి ఎవరు పోయారని సంక్రాంతి చేసుకుంటారు?''

''అది తెలియదు'' అంది కావ్య.

''సరే.. దసరాకి పూజలు చేస్తారు. దీపావళికి టపాసులు కాలుస్తారు. మరి సంక్రాంతికేం చేస్తారు?''

''ముగ్గులు పెడతారు'' ఠక్కున చెప్పింది కావ్య.

''ఇంకా?''

''ఇంకా అంటే.. మనకి సెలవలిస్తారు. అమ్మ కొత్త బట్టలు కొంటుంది. టీవీలో స్పెషల్ ప్రోగ్రామ్‌లు వేస్తారు. పనిమనుషులు డబ్బులడుగుతారు..'' అలవాటు ప్రకారం సాగదీస్తూ చెబుతూ మధ్యలో అనుమానమొచ్చి అడిగింది- ''అవునూ... ఇపుడివన్నీ ఎందుకడుగుతున్నావ్?''

''మా టీచర్ సంక్రాంతి మీద వ్యాసం రాసి తీసుకురమ్మంది'' చెప్పింది రమ్య.

''అంటే ఇన్ఫర్మేషనంతా నా దగ్గర నుంచి లాగి వ్యాసం రాసి టీచర్ చేత మార్కులేయించేసుకుంటావా?'' దెబ్బలాడుతూ అంది కావ్య.

''అసలు నిన్నడగడం నాదే బుద్ధి తక్కువ. అమ్మనడిగి ఉంటే ఒక థీసిస్‌కి సరిపడా మేటర్ చెప్పుండేది''

అసలు విషయం మర్చిపోయి ఇద్దరూ వాదులాటకి దిగారు.

నేను మాత్రం అసలు విషయాన్ని మర్చిపోలేకపోయాను.

''సంక్రాంతి అంటే ఏమిటి?'' అన్న రమ్య ప్రశ్న వినిపిస్తోంది చెవుల్లో.

పత్రికల వాళ్లు కథల పోటీలు పెడితే కానీ నాలాంటి వాళ్లకీ, షాపుల వాళ్లు స్పెషల్ డిస్కౌంట్ ఆఫర్లు ప్రకటిస్తేగానీ మామూలు మనుషులకీ పండుగలొస్తున్నాయని తెలియని రోజులివి. ఈ రోజుల్లో పిల్లలకి సంక్రాంతి అంటే ఏమిటంటే ఎలా చెబ్తాం?

నా మటుకు నాకు సంక్రాంతి అంటే... నా బాల్యం!

సంక్రాంతి అంటే మా ఊరు... దోసకాయలపల్లి.

సంక్రాంతి అంటే అమ్మ వేసే గొలుసుకట్టు ముగ్గులు.

నేను పెట్టిన గొబ్బెమ్మలు.

పొద్దున్నే పొగమంచులో హరిదాసుల కీర్తనలు.

గంగిరెద్దుల శ్రావ్యమైన సన్నాయి స్వరాలు.

మా ఊరి వేణుగోపాలస్వామి గుళ్లో ధనుర్మాసం పూజలకి చేయించే ప్రత్యేక ప్రసాదాల కమ్మని రుచి.

మావయ్యలూ, బాబాయిలూ కలిపి వేసే పెద్ద పెద్ద భోగిమంటలు.

ఎక్కడెక్కడి నుంచో ఇంటికి వచ్చే చుట్టాలు!

పొలం నుంచి ఎడ్లబండ్ల మీద ఇంటికి చేరే ధాన్యం బస్తాలు.

మా పాలేర్లందరి కళ్లల్లోనూ కనబడే సంతోషం... సంతృప్తి!

అదే సంక్రాంతి!!!

ఆ విషయాన్ని ఈ కాలం పిల్లలకి ఎలా చెప్తాం?

ఈ రోజుల్లో సంక్రాంతి అంటే.. టీవీలో వరసగా మూడు రోజులు స్పెషల్ ప్రోగ్రాములు రావడం.

మాస్ హీరోల సినిమాలు భారీ సంఖ్యలో ఒకేసారి విడుదల కావడం.

ఇంకా చెప్పాలంటే ఉమ్మడి కుటుంబం కథల సినిమాల్లో ఒక సీను సంక్రాంతంటే.


అలాంటిది వీళ్లకి నిజమైన సంక్రాంతి గురించి చెప్పాలంటే కాలాన్ని ఒక్కసారి వెనక్కి గిర్రున తిప్పేసి 'సంక్రాంతి...లైవ్ ఫ్రమ్ దోసకాయలపల్లి' అని ఒక ప్రోగ్రామ్‌ని చూపించాల్సిందే!

చదువుతున్న కాగితాల మీద దృష్టి పెట్టలేక లేచి బాల్కనీలోకి వచ్చాను.

అప్పుడే చీకటి పడుతోంది.

బాల్కనీ తలుపు తెరవగానే పలకరించిన చిరుచలిని చూస్తే అనిపించింది ధనుర్మాసం వచ్చేసుంటుందని.

> **''పండుగకి అర్థం.. పరమార్థం.. మనకున్నది నలుగురితో పంచుకోవడమే! ప్రత్యేకంగా సంక్రాంతి పండుగ నేలతల్లి మనకిచ్చే బహుమతైతే సంక్రాంతి చేసుకోవడం నేలతల్లికి మనమిచ్చే బహుమతి'' అనే వాడు.**



క్రింద సెల్లార్‌లో ఆడుకుంటున్న పిల్లల అరుపులు తప్ప అంతా స్తబ్దుగా ఉంది వాతావరణం.

గోధూళి లేని సంధ్యా సమయం.

ముంగిట ముత్యాల ముగ్గులు లేని వాకిళ్లు.

ఇవన్నీ చూడటం నాకు ఎప్పటి నుంచో అలవాటైపోయినా, అప్పుడప్పుడు ఇలా పాత జ్ఞాపకాలు గుర్తుకు వస్తేనే ఏదో వెలితిగా అనిపిస్తుంది.

''మారుతున్న కాలంతో పాటూ మనం కూడా మారాలే చిన్నీ.. లేకపోతే ఓల్డ్ ఫ్యాషన్స్‌గా ఉండిపోతాం'' అనే రామం బాబాయ్ మాటలు గుర్తొచ్చాయి.

నవ్వుతూనే అన్నా.. ఆయన మాటల వెనుకున్న బాధని నా మనసు ఇట్టే పట్టేసేది.

రామం బాబాయ్ మా నాన్నకి ప్రాణ స్నేహితుడు. విచిత్రమేమిటంటే ఆయన నాకు కూడా స్నేహితుడే. అందరితోనూ అలాగే ఉండేవాడు.

మా చిన్నప్పుడు సంక్రాంతికి రామం బాబాయ్ చాలా హడావిడి చేసేవాడు. పండక్కి పది రోజులుండనగానే నాన్నని పట్నం బయలుదేరదీసి మా ఇంట్లో వాళ్లకీ వాళ్లింట్లో వాళ్లకీ వచ్చే చుట్టాలకీ కొత్త బట్టలు కొనిపించేవాడు.

పనిమనుషులకీ పాలేర్లకి కూడా పేరు పేరునా గుర్తుపెట్టుకుని కొత్త బట్టలు కొని తెచ్చి ఇచ్చేవాడు.

''పండుగకి అర్థం.. పరమార్థం.. మనకున్నది నలుగురితో పంచుకోవడమే! ప్రత్యేకంగా సంక్రాంతి పండుగ నేలతల్లి మనకిచ్చే బహుమతైతే సంక్రాంతి చేసుకోవడం నేలతల్లికి మనమిచ్చే బహుమతి'' అనే వాడు.

అన్ని పండగల్లోనూ ఆయనకి సంక్రాంతి అంటేనే ఇష్టం. ఎందుకంటే అది వ్యవసాయానికి సంబంధించిన పండుగ కావడం. పంట చేతికొచ్చిన సంబరంలో పల్లె జరుపుకొనే సంబరం లాంటి పండుగ కావడమే కారణం!

కోడిపందాల్లో పెద్దవాళ్లతో కలిసి ఎంత బాగా ఆనందించేవాడో, భోగిమంటకి కర్రల్ని పోగేయడంలో పిల్లలతో కూడా అంత బాగానే కలిసిపోయేవాడు.

మేం ముగ్గులు పెడుతుంటే తెల్లవారుఝామున మాతో పాటూ లేచి మాకు సాయంగా అరుగుమీద కూర్చుని మేం పెట్టే ముగ్గుల్ని చూసేవాడు.

మాకు గొబ్బిళ్ల కోసం ప్రత్యేకంగా ఒక మనిషిని పురమాయించి ఆవు పేడ తెప్పించేవాడు. సంక్రాంతి వచ్చేసరికి మా పెరటి గోడ మొత్తం భోగి పిడకలతో నిండిపోయేది.

ఊళ్లో పిల్లా పెద్దా, ధనిక, పేద అన్న భేదాలు లేకుండా అందరూ కలసిమెలిసి సంక్రాంతి సంబరాలు జరుపుకోవడం వెనుక రామం బాబాయ్, మా నాన్నల పాత్ర ఎంతో ఉండేది.

ఏ కారణం చేతనైనా ఎవరి పొలంలోనైనా పంటలు సరిగా పండకపోతే వాళ్లకి సాయం చేయడంలోనూ, అంతా కలిసి సమిష్టిగా వ్యవసాయం చేసి ఎక్కువ పంటలు పండించడంలోనూ మా ఊరు అందరికీ ఆదర్శప్రాయంగా ఉంది.

ఇదంతా ఎప్పటి మాటో!

కాలానుగుణంగా అన్ని పల్లెల్లోనూ మార్పులు వచ్చినట్లే మా ఊళ్లోనూ వచ్చింది. రామం బాబాయ్ లాంటి వాళ్లు జీర్ణించుకోలేని మార్పు!

''ఇప్పటికీ సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశిస్తూనే ఉన్నాడు. సంక్రాంతి ప్రతి యేటా వస్తూనే ఉంది. కానీ ఆ సంబరాలే లేవే చిన్నీ. సంక్రాంతి కూడా నాలాగా ముసలిదైపోయింది. గంగిరెద్దుల వాడి ఎడ్లు బక్కచిక్కిపోయాయి. వాడి సన్నాయి స్వరాలే పలకడం లేదు. హరిదాసు గొంతు ఒణుకుతుంది. కోడిపందాల్లో కోళ్లకి బదులు మనుషులే కొట్టుకుంటున్నారు. పండిన పంటని పొలం పని చేసిన వాళ్లతో సమంగా పంచుకోవడమన్న ఆచారం ఎప్పుడో పోయింది. వాళ్లకి జీతం రాళ్లతోనే సరిపెట్టేస్తున్నారు'' అన్నాడొకసారి ఆయన ఆవేదనగా.

నిజమే...

సామాజిక ప్రయోజనానికి నీళ్లొదిలేసి వ్యక్తిగత ప్రయోజనానికే ప్రాధాన్యత నిస్తున్న రోజులివి. మనిషికీ మనిషికీ మధ్య ఉండాల్సిన గాఢమైన అనుబంధం లేనప్పుడు పండుగలు యాంత్రికంగా కాక అర్థవంతంగా ఎలా ఉంటాయి?

భూదాన్ ఉద్యమంలో తమకున్న పొలంలో సగం పొలాన్ని దానమిచ్చిన చరిత్ర రామం బాబాయ్ వాళ్ల పూర్వీకులది! వాళ్ల స్ఫూర్తితో బ్రతికే ఆయన లాంటి వాళ్లు ఈనాటి సమాజాన్ని చూడాల్సి రావడం దురదృష్టకరమే.

నాన్న పోయాక నేను మా ఊరికి వెళ్లడం నేను దాదాపు మానేశాను.

ఆ మధ్యనొకసారి రామం బాబాయ్‌ని చూడాలని వెళ్లాను

వాళ్ల పిల్లలు కూడా పెద్ద పెద్ద చదువులు చదువుకొని అంతా విదేశాల్లోనూ పట్టణాల్లోనూ స్థిరపడిపోయారు. ప్రస్తుతం ఆ ఊళ్లో బాబాయ్ పిన్నీ మాత్రమే ఉంటున్నారు.

ఒకప్పుడు ఎంతో వైభోగంతో కళకళలాడిపోయిన మా ఇళ్లూ... మా ఊరూ వెలిసిపోయిన బొమ్మల్లా కనిపించాయి.

''ఏమిటి బాబాయ్ ఇలా అయిపోయింది మన ఊరు?'' అన్నాను నేను ఆవేదనగా.

రామం బాబాయ్ సాలోచనగా చూస్తూ నవ్వాడు.

''మార్పు! కాలంతో పాటూ మన ఊరూ మారింది. పూరిగుడిసెల స్థానంలో కాంక్రీటు బిల్డింగులొచ్చాయి. నాగళ్ల స్థానంలో ట్రాక్టర్లొచ్చాయి. గోవు మాలక్ష్ములు డైరీఫారాలయ్యాయి. కానీ చూసే నీ దృష్టిలో మార్పు రాకపోబట్టి నీకిదంతా కొత్తగానూ వింతగానూ అనిపిస్తోంది. మన ఊరిలో వచ్చిన ఈ మార్పు గురించి నాకేం బాధలేదమ్మా. కానీ మనుషుల్లో వచ్చిన మార్పే నన్ను కృంగదీస్తోంది'' అన్నాడాయన బాధగా.

''అయినా ఈ వయసులో ఇక్కడ ఒంటరిగా ఉండడమెందుకు మీరిద్దరూ? అన్నయ్యల దగ్గరకెళ్లిపోవచ్చు కదా?'' అన్నాను నచ్చచెబుతున్నట్లు.

ప్రస్తుతం ఊళ్లో చాలావరకు జనాభా చుట్టుపక్కలున్న పట్టణాలకి వలసవెళ్లిపోయారు. మాకు బాగా తెలిసిన కుటుంబాలు కొన్ని మాత్రమే ఉన్నాయి.

''నాకింకా నమ్మకం చచ్చిపోలేదే. ఇక్కడ చేయాల్సిందింకా ఏదో ఉందనే అనిపిస్తోంది'' అన్నాడాయన నన్ను బస్సెక్కిస్తూ ఆ రోజు.

ఆలోచనలు మా ఊరిమీదకి మళ్లడంతో వెంటనే రామం బాబాయ్‌కి ఫోన్ చేయకుండా ఉండలేకపోయాను.

''చిన్నీ ఎలా ఉన్నావురా? సంక్రాంతి వస్తోందిగా. నువ్వు తప్పకుండా ఫోన్ చేస్తావని అనుకుంటూనే ఉన్నాను'' అన్నాడు రామం బాబాయ్ ఫోన్ ఎత్తగానే.

నేను నవ్వేను. ''ఏమిటి బాబాయ్ విశేషాలు?'' అడిగాను.

''నీకో శుభవార్త'' అన్నాడాయన ఉత్సాహంగా.

''శుభవార్తా? ఏమిటది?'' ఉత్సుకతగా అడిగాను.

''నిదానంగా చెబుతాను విను. మొన్న మనింటికి నలుగురు కుర్రపిల్లలు వచ్చారు. ఇద్దరాడపిల్లలు, ఇద్దరు మగాళ్లూను. వ్యవసాయం చదువుల్లో డిగ్రీలు చేశారట. చూడడానికి చాలా మంచాళ్లలా ఉన్నారు. రీసెర్చి ల్యాబొరేటరీ పెడతారట. వ్యవసాయంలో కొత్త ప్రయోగాలు చేయడానికి మన పొలం రెండెకరాలు లీజుకి కావాలని అడిగారు''

''ఇచ్చేవా?'' అడిగాను.

''రెండెకరాలు లీజుకి కాదు మొత్తం పొలం ఊరికే ఇచ్చేస్తానన్నాను నేను చెప్పినట్లు వింటే''

''ఏమిటీ'' అన్నాను నేను ఆశ్చర్యంగా.

''అవును వాళ్లు చేయాల్సిన మొదటి పని ప్రస్తుతమే కాకుండా పెళ్లిళ్లయి జీవితంలో స్థిరపడ్డాక కూడా ఇక్కడే ఈ ఊళ్లోనే కుటుంబాలతో సహా ఉండి వ్యవసాయం చేయాలి. రెండు... పొలంలో పనిచేయడానికి మన ఊరి మనుషులనే కూలికి పెట్టుకోవాలి. మూడు... పంట చేతికి రాగానే వాళ్లకి కావాల్సిన లాభం వాళ్లు తీసుకుని మిగిలిన దాన్ని కూలి డబ్బులతో పాటూ, పనిచేసిన వాళ్లందరికీ సమానంగా పంచాలి! ఈ మూడింటికీ ఒప్పుకుంటే వాళ్ల ప్రయోగాలకి నా పొలాన్ని ఊరికే ఇచ్చేస్తానన్నాను''

''వాళ్లేమన్నారు?'' సంభ్రమంగా అడిగాను.

''నా నమ్మకం వమ్ము కాలేదు. వాళ్లు సంతోషంగా ఒప్పుకున్నారు. ఈ సంక్రాంతి నాడే వాళ్ల పరిశోధన సంస్థ ప్రారంభోత్సవం!'' అన్నాడాయన సంతోషంగా.

''కంగ్రాచ్యులేషన్స్ బాబాయ్. మొత్తానికి నువ్వు అనుకున్నది సాధిస్తున్నావు'' అన్నాను నేను కూడా ఎంత సంతోషంగా.

''చిన్నీ'' అన్నాడు బాబాయ్ ఆర్ద్రతగా. ''మన ఊళ్లో మళ్లీ త్వరలోనే సంక్రాంతి జరుగుతుంది. నిజమైన సంక్రాంతి. ఆ సంక్రాంతి నీ చిన్నప్పటి సంక్రాంతి అంత అందంగా ఉంటుందో ఉండదో చెప్పలేను కానీ కచ్చితంగా అప్పుడున్నంత స్ఫూర్తితో ఉంటుంది. అప్పుడు నువ్వు తప్పకుండా మన ఊరు రావాలి''

ఆయన మాటలకి నా కళ్లలోకి నీళ్లు వచ్చేశాయి.

'నీ లాంటి మనిషి పుట్టడం ఈ నేల తల్లి చేసుకున్న అదృష్టం' అనుకున్నాను మనసులో.

ఫోన్ పెట్టేశాక చాలాసేపు అలాగే ఉండిపోయాను.

నెమ్మదిగా తేరుకుని పక్క గదిలోకి వెళ్లాను.

''ఏం పిల్లలూ... సంక్రాంతి రోజులు వచ్చేశాయి. ముగ్గులు పెట్టడానికి వస్తారా?'' అడిగాను.

''ఈ అపార్టుమెంటు సందుల్లో ముగ్గులేం పెడతామమ్మా. అందరూ తొక్కేస్తారు'' అన్నారు వాళ్లు.

''ముగ్గులు తొక్కకూడదని ఎవరన్నారు? పోనీ మీరన్నట్లుగానే తొక్కినా చెరగకుండా పెయింట్‌తోనే వేద్దాం రండి''

ముగ్గురం సరంజామాతో సహా వాకిట్లోకి చేరాం.

ముగ్గు వేయడానికి చుక్కలు పెడుతూ మెల్లగా పెదవి విప్పాను, మా పిల్లలకి సంక్రాంతి గురించీ, మా రామం బాబాయ్ గురించీ చెప్పడానికి.

☆

